# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలోని మిరప రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు.**

**2.** **విద్యాశాఖకు సంబంధించిన అంశాలకు ఒకే యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.**

**3.** **మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుల నుంచి టమాటా కొనుగోలును ఈరోజు నుంచి ప్రారంభించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

**4.** **చేనేత కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

రాష్ట్రంలోని మిరప రైతులను ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మిరప పంటకు తగిన మద్దతు ధర ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశామన్నారు. మిరప రైతులకు లబ్ధి కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని రామ్మోహన్‌నాయుడు తెలియజేస్తూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యాశాఖకు సంబంధించి వివిధ అంశాలను సమన్వయం చేస్తూ ఇకపై ఒకే యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.గుంటూరు జిల్లా ఉండవల్లిలో పాఠశాల విద్య సమగ్ర శిక్ష అభియాన్‌పై ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖకు సంబంధించి అన్ని అంశాలు ఏకీకృతం చేసి ఒకే డాష్ బోర్డును రూపొందించాలన్నారు. దీనివల్ల ఉపాధ్యాయుల బోధన, హాజరు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై ఎక్కువ సమయం శ్రద్ధ కేటాయించేలా అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గరిష్ట స్థాయిలో ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

---------------------------

రాజధాని అమరావతితో పాటు ఇతర నగరాలు, పట్టణాల అభివృద్ధిలో ముంబై తరహా నగరాభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ–ఎంఎంఆర్డీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఇతర అధికారులతో కలిసి మంత్రి నారాయణ నిన్న ముంబైలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాభివృద్ధికి ముంబై అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని అన్నారు. తాము గుర్తించిన అంశాలు, అభివృద్ధి ప్రణాళికలపై అధ్యయనం చేసిన తర్వాత సమగ్ర నివేదిక రూపొందించి ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుల నుంచి టమాటా కొనుగోలు ఈరోజు నుంచి ప్రారంభించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చన్నాయుడు తెలిపారు. టమాటా ధరల తగ్గుతున్న నేపథ్యంలో ఆయన నిన్న సంయుక్త కలెక్టర్లతో అమరావతి నుండిదృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరోజు నుంచి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమాటా సేకరణ చేపట్టి వాటిని రైతు బజార్లకు పంపిణీ చేయాలని సూచించారు. అవసరం మేరకు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం అందించే రవాణా రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో 2 వేల మంది పోలీసులతో భద్రత చర్యలు చేపట్టినట్లు నంద్యాల జిల్లా ఇన్ ఛార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శ్రీశైలంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, 6 డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెబుతూ...

వాయిస్ ..35 సెకన్లు

కాగా ఈ రోజు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమివనున్నారు. రాత్రికి గ్రామోత్సవం జరగనుంది.

---------------------------

చేనేత కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. రాష్ట్రంలో తయారవుతున్న చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా తమిళనాడు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమ్మకాలు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విధంగా రాష్ట్రానికి చెందిన ఆప్కో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తో ఈరోజు అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నాయని పేర్కొన్నారు. తద్వారా ఇరు రాష్ట్రాల చేనేత ఏజెన్సీలు తమ ఉత్పత్తులను సమిష్టిగా విక్రయించి లబ్ధి పొందే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

---------------------------

అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈరోజు మాతృ భాష దినోత్సవర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా వికాస సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు జె శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ, మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకొని తెలుగు భాషలోనే మాట్లాడాలని చెబుతూ...

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సంక్రమించని వ్యాధులు- ఎన్సీడీ రహిత భారత్ లో భాగంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు ఇంటెన్సిఫైడ్ స్పెషల్ ఎన్‌సిడి స్క్రీనింగ్ డ్రైవ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశ వర్కర్లు ఆరోగ్యకార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచామని, అన్ని విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు రోజువారి సమీక్ష నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు గ్రామ,వార్డు సచివాలయ శాఖ సంచాలకులు శివప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. ఆరేళ్లలోపు చిన్నారుల పేర్లతో కొత్తగా ఆధార్ నమోదు, పాత వాటి సవరణకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరేళ్లలోపు చిన్నారులు 8 లక్షల 53 వేల ఉన్నారని వారిని ఆధార్‌లో నమోదు చేయాలని తెలిపారు.

======================